నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | SANGAREDDY

రైతుభరోసా అడిగితే చావుమంటుండు

- ఏఈవో తీరుపై మండిపడ్డ రైతులు

ఏఈవోపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలుపుతున్న రైతులు

హత్నూర, ఫిబ్రవరి 20: రైతుభరోసా డబ్బులు అకౌంట్లలో జమకావడం లేదని అడిగిన పాపానికి ఆత్మహత్య చేసుకుంటేనే వస్తాయని ఏఈవో సమాధానం ఇస్తున్నాడని సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆరోపించారు. గురువారం కాసాల శివారులోని పొలంలో క్రిమిసంహారక డబ్బాలు చేతపబట్టుకొని ఏఈవో తీరుపై రైతులు నిరసన తెలిపారు. తమతో చులకనగా మాట్లాడుతున్న ఏఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సకాలంలో రైతుబంధు డబ్బులు తమ అకౌంట్లల్లో పడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రైతుభరోసా డబ్బులు తమ ఖాతాల్లో ఇంకా జమకాలేదన్నారు. దీనిపై కాసాల-దౌల్తాబాద్ క్లస్టర్ ఏఈవో మహేందర్‌ను సంప్రదించగా.. పెట్రోల్ పోసుకొని లేదా పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంటేనే రైతుభరోసా డబ్బులు వస్తాయని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి అన్నంపెట్టే రైతుల పట్ల చులకనగా మాట్లాడుతున్న ఏఈవో మహేందర్‌పై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నిరసనలో రైతులు శ్రీనివాస్‌గౌడ్, ప్రభుకృష్ణ, అఖిల్, మల్లేశం, మహేందర్, కృష్ణ పాల్గొన్నారు. ఈ విషయమై ఏఈవో మహేందర్‌ను వివరణ కోరగా.. తాను అలా మాట్లాడలేదని, ప్రభుత్వం ఎప్పుడు అకౌంట్లో జమ చేస్తే అప్పుడు జమ అవుతాయని చెప్పినట్లు తెలిపారు.

గుప్త నిధుల తవ్వకాల కలకలం

– పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

లింగారెడ్డిపేటలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను విచారిస్తున్న పోలీసులు

మనోహరాబాద్, ఫిబ్రవరి 20: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో గుప్త నిధుల కోసం కొంతమంది నగర వాసులు తవ్వకాలు జరపడం స్థానికంగా కలకలం రేపింది. మండలంలోని లింగారెడ్డిపేటలో త్రిపుర వెంచర్‌లో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు గురువారం రాత్రి జేసీబీ సహాయంతో తవ్వకాలు ప్రారంభించారు. వారి వెంట తెచ్చుకున్న పూజా సామగ్రితో పూజలు జరుపుతూ ఉండగా అటుగా వెళ్తున్న రైతులు వారిని ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. దీంతో వారు రైతులతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో రైతులు విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయడంతో వారంతా ఘటనా స్థలానికి చేరుకొని తవ్వకాలు చేస్తున్న ముగ్గురిని చితకబాదారు. వారి వద్ద ఉన్న తాయత్తులు, కుంకుమ, పసుపుతో పాటు పలు వస్తువులను స్వాధీనం చేసుకుని పోలీసులకు సమాచారం అందించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

అమాత్యులారా.. హామీ ఏమాయే!

- కొమురవెల్లి 'అమ్మవార్ల'కు ఇచ్చిన హామీ నెరవేర్చని మంత్రులు
- బ్యాంకు లాకర్లలో మూలుగుతున్న బంగారం
- కిరీటాల తయారీ ఎప్పుడంటున్న భక్తులు
- బీఆర్ఎస్ హయాంలో మల్లన్నకు బంగారు కిరీటం, వెండి సింహాసనం, వెండి తాపడం తయారీ
- ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

నాడు మాట తప్పని పాలకులు.. నేడు పట్టింపులేని మంత్రులు



తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి కేసీఆర్ హయాంలో తగిన గుర్తింపు, ఆదరణ లభించింది. కల్యాణోత్సవానికి ఓ పర్యాయం సీఎం హోదాలో కేసీఆర్ హజరై స్వామి వారికి 133 ఎకరాల భూమిని కేటాయించారు. అనంతరం మంత్రి హోదాలో తన్నీరు హరీశ్‌రావు హాజరై భక్తుల కోరిక మేరకు కొమురవెల్లి మల్లన్న స్వామికి వెండి సింహాసనం చేయించి ఇస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకున్నారు. అంతేకాకుండా ఆ తర్వాత స్వామి వారి ద్వారాలు, తలుపులకు వెండి తాపడం చేయిస్తామని హామీ ఇచ్చి దానిని నెరవేర్చారు. మల్లన్న స్వామి కల్యాణోత్సవానికి బంగారు కిరీటం చేయిస్తామని హామీ ఇచ్చి కల్యాణోత్సవ సమయంలో స్వర్ణ కిరీటం తయారు చేయించి గర్భాలయంలో స్వామివారి తలకు కిరీటం ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా ఆలయంలో కొత్తగా క్యూకాంప్లెక్స్‌లు, కాటేజీల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆలయం ఖ్యాతి రాష్ట్రమంతా విస్తరించి భక్తుల తాకిడి పెరిగింది.

బీఆర్ఎస్ హయాంలో ఆలయానికి గుర్తింపు...

చేర్యాల, ఫిబ్రవరి 20: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ పాలకులు, కనీసం దేవతలకు ఇచ్చిన హామీని సైతం నిలబెట్టుకోవడం లేదు. కొమురవెల్లి ఆలయంలో కొలువుదీరిన బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు స్వర్ణ కిరీటం తయారు చేయించి సమర్పిస్తామని గతేడాది దేవాదాయశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ కల్యాణోత్సవానికి హాజరైన సందర్భంగా ప్రకటించారు. కానీ, ఇప్పటి వరకు ఆ హామీని మంత్రులు నిలబెట్టుకోలేదు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ఘనంగా కొనసాగుతున్నాయి. కానీ, అమ్మవార్ల కిరీటాలు మాత్రం తయారుకాలేదు. దీంతో మంత్రుల హామీలు ఉత్తవే అనే విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. కొమురవెల్లి ఆలయానికి భక్తులు సమర్పించిన బంగారం 8కిలోలకు బ్యాంకు లాకర్లలో భద్రపరిచి ఉంది. బ్యాంకర్లలో ఉన్న బంగారం తీసుకు వచ్చి దానికి ప్రత్యేకంగా టెండర్లు పిలిచి ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో కిరీటాలు తయారు చేయించాల్సి ఉంటుంది. కేవలం ఆదేశాలు ఇస్తే పూర్తయ్యే ఈ పనులను సైతం మంత్రులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కాంగ్రెస్ పాలనలో చిన్నచూపు...

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధిపై కాంగ్రెస్ పాలకులు చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎన్నడూ లేని విధంగా ఆలయ పాలక మండలి నియామకం విషయంలో 70 మందికి పైగా దరఖాస్తు చేసుకుంటే, అందులో 8 మందికి మాత్రమే పాలక మండలి సభ్యులుగా నియమించారు. 14 మంది సభ్యులు ఉండాల్సి ఉండగా, మిగిలిన సభ్యుల నియామకం కోసం మరో ప్రకటన విడుదల చేసి తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడంతో మరో 40 మంది సభ్యులు దరఖాస్తు చేసుకున్నారు.దీంతో కొమురవెల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటికీ పాలక మండలి నియామకం లేకుండా ఆగిపోయింది. కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిపాలన ఉద్యోగి డిప్యూటీ కమిషనర్ హోదా కలిగి ఉన్నప్పటికీ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను గతంలో నియమించారు. ప్రస్తుతం ఆలయంలో ఒక ఏఈవో, ఇద్దరు సూపరింటెండెంట్లు ఉండగా, హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు అనే అధికారిని మల్లన్న ఆలయ ఫుల్ అడిషనల్ చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బీఆర్ఎస్ హయాంలో పలువురు నిరుద్యోగులకు తాత్కాలిక ప్రాతిపదికన ఆలయంలో ఉద్యోగాలు కల్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదుగురు నిరుద్యోగులను తొలిగించడంతో వారు రోడ్డున పడ్డారు. కాంగ్రెస్ సర్కారుకు కొమురవెల్లి మల్లన్న ఆలయంపై చిన్నచూపు ఉందని భక్తులు ఆరోపిస్తున్నారు.

నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

- రూ. 5.60 కోట్లతో జహీరాబాద్-బీదర్ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు
- దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్న వాహనదారులు

జహీరాబాద్, ఫిబ్రవరి 20: జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రధాన రోడ్డు మార్గమైన జహీరాబాద్-బీదర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు మార్గంలోని పలు గ్రామాల సమీపంలోని రోడ్డుపై గుంతలు పడి వాహనచోదకులు ఇబ్బందులు పడుతుండడంతో మరమ్మతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధుల కింద రూ.5.60 కోట్లు మంజూరు చేసింది. ఎనిమిది కిలోమీటర్ల దూరం మేరకు గుంతలుపడి పాడైన రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ వాగు ప్రాజెక్టు సమీపంతో పాటు న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ చౌరస్తా సమీపంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన్నారు. ఈ మార్గంలో పలుచోట్ల రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. వారం రోజులుగా తవ్విన రోడ్డు మార్గంలో ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి ప్రతిరోజు ఈ రోడ్డు గుండా వందలాది వాహనాలు రోకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో విపరీతంగా దుమ్ములేస్తుండడంతో జనాలు బేజారవుతున్నారు. దుమ్ము కారణంగా పాదచారులు ముక్కు, మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు ద్విచక్ర వాహనచోదకులకు రోడ్డు కనిపించని విధంగా దుమ్ము లేవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విస్తరణ పనులు, మరమ్మతులు వేగవంతంగా చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కొత్తూర్(బి) సమీపంలో నత్తనడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

రద్దు చేసేవరకు పోరు ఆగదు

డంపింగ్‌యార్డు ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని ఆందోళనలు

- గుమ్మడిదలలో 9వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష
- దీక్షలో కూర్చున్న వర్తక సంఘం ప్రతినిధులు
- నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 16వ రోజుకు చేరిన దీక్షలు
- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన
- జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించిన మహిళలు

గుమ్మడిదలలో వర్తక సంఘం సభ్యులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న రైతు జేఏసీ నాయకులు జైపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కుమార్‌గౌడ్

గుమ్మడిదల, ఫిబ్రవరి 20: వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న తమను ఆగం చేయవద్దని, డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి కుంపటి పెట్టవద్దని బాధిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్యానగర్‌లో జీహెచ్ ఎంసీ డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ గురువారం 16వ రోజు గుమ్మిడిదలలో ఆందోళనలు కొనసాగాయి. గుమ్మడిదలలో రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్,రాంరెడ్డి ఆధ్వర్యంలో వర్తక సంఘం ప్రతినిధులు ఆకుల సత్యనారాయణ, సభ్యులు రిలే నిరహార దీక్ష చేపట్టారు. దీనికి బొంతపల్లి, దోమడుగు వర్తక సంఘం అధ్యక్షుడు ఉప్పునూతుల బాల్‌రాజ్‌గౌడ్, ఫయాజ్ షరీఫ్, కార్యదర్శి కృష్ణమూర్తి సంఘీభావం తెలిపారు.గురువారం ఉదయం 10 గంటల నుంచి 2 వరకు వర్తక సంఘం సభ్యులు స్వచ్ఛందంగా వాణిజ్య వ్యాపార, దుకాణ సముదాయాల బంద్ పాటించారు. అనంతరం మహిళా జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై భారీ ర్యాలీ చేపట్టారు. డంపింగ్‌యార్డు మూకొద్దంటూ నినాదాలు చేశారు. రిలే నిరాహార దీక్షలను మరింత ఉధృతం చేయడానికి వర్తక సంఘం అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, సంఘం ప్రతినిధులతో కలిసి రూ.20 వేలు జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డికి విరాళంగా అందజేశారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామస్తులు, గుమ్మడిదలకు చెందిన జేఏసీ నాయకులు గురువారం సంగారెడ్డిలో సీపీఎం ఆధ్వర్యంలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నా, రాస్తారోకోకు తరలి వెళ్లారు, నర్సాపూర్‌లో చేస్తున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఆందోళనలో మంద భాస్కర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, మంగయ్య, నర్సింలు, పోచుగారి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నల్తూరు యాదగిరి, ఆంజనేయులుయాదవ్, కుమ్మరి ఆంజనేయులు, రామకృష్ణ, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్

ఝరాసంగం, ఫిబ్రవరి 20: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయని డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఝరాసంగంలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సుమారు 2లక్షల వరకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ వైపు నుంచి, హైదరాబాద్ వైపు నుంచి జీర్లపల్లి, ఈదులపల్లి మీదుగా ఆలయానికి వచ్చే కనెక్టివిటీ రోడ్లు అధ్వానంగా ఉన్నందున మరమ్మతులు చేయాలని కోరారు. రహదారుల వెంబడి సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉత్సవాలు బ్రహ్మాండంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిధు లు కేటాయించాలని కోరారు. అవాంఛనీ య ఘటనలు జరగకుండా అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఏడాకులపల్లి మాజీ సర్పంచ్ మాణిక్‌ప్రభు పాల్గొన్నారు.

వైద్యానికి వెళ్లి.. శవమై వచ్చాడు

- ఓ ప్రైవేటు దవాఖానలో వైద్యం వికటించి రోగి మృతి

శ్రీనివాస్ (ఫైల్)

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 20: చిన్న చికిత్సే కదా ఇలా వెళ్లి అలా వస్తానంటూ నవ్వుతూ దవాఖానకు వెళ్లిన వ్యక్తి శవమై వచ్చిన ఘటన అందరినీ కలిచివేసింది. నిన్న మొన్నటి దాకా పెండ్లిండ్లు, పేరంటాలకు సంతోషంగా వెళ్లి అందరితో కలుపుగోలుగా ఉన్న వ్యక్తి ఒక్కసారి తమ మధ్య లేడనే విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు కుటుంబీకులు, బంధువులు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గారకుర్తికి చెందిన వెల్టూరు శ్రీనివాస్(44) బుధవారం తనకు అప్పుడప్పుడు గురక సమస్య ఇబ్బందిగా మారిందని సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు దవాఖానకు వెళ్లాడు. తనకు గురక సమస్య ఉన్నదని చెప్పడంతో పరిశీలించిన వైద్యులు చిన్నపాటి సర్జరీ చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని భరోసా ఇచ్చారు. మందులతో తగ్గదా? సర్జరీ ఎందుకని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. అందుకు స్పందించిన వైద్యులు ముక్కులో ఎముక పెరిగిందని, దాన్ని సర్జరీ చేస్తే మాములు అవుతుందని వివరించారు. దీంతో సర్జరీ చేసిన వైద్యులు అదేరాత్రి 2గంటల సమయంలో సదరు వ్యక్తికి గుండెపోటు వచ్చి మరణించాడని సాకులు చెప్పారని ఆరోపించారు. అదేరోజు సర్జరీ చేయగానే మరణించి ఉంటాడని, ఆ విషయాన్ని తమకు చెప్పకుండా నిదానంగా రాత్రిపూట చెప్పారని, దీనిపై తమకు అనుమానం ఉందన్నారు. శ్రీనివాస్ గుండెపోటుతోనే మరణించాడని దవాఖాన వైద్యులు చెప్పడంతో బంధువులు, కుటుంబీకులు ఆందోళనకు దిగారు. గురువారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి బంధువులు ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. పోలీసులు వచ్చి వారిని శాంతింపజేసే ప్రయత్నం చేశారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. తమకు దిక్కెవరంటూ బాధిత కుటుంబం రోదనలు అందరినీ కదిలించాయి.

కేసు దర్యాప్తు చేస్తాం..

మృతుడి సోదరుడు నాగేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు వెల్లడించారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన సమాచారం మేరకు ఏం జరిగిందనే అంశంపై దర్యాప్తు చేస్తామన్నారు.

సీఎం స్పందించి డంపుయార్డు రద్దుచేయాలి

- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు, గుమ్మడిదల గ్రామస్తులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 20: ప్యారానగర్ డంపుయార్డు రద్దుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచించాలని, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూస్తే ప్రజలు మరింత తిరగబడతారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు అన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అంతకు ముందు పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంప్ యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా ఏకపక్షంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. 17 గ్రామాలకు చెందిన 40 వేల మంది ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని, ప్రజలందరూ రోడ్లెక్కి ఆందోళనలు చేస్తుంటే జిల్లా కలెక్టర్ స్పందించక పోవడం సరికాదన్నారు. వాస్తవ పరిస్థితిని గమనించి ప్రభుత్వానికి నివేదిక పంపాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందని ఆయన పేర్కొన్నారు. గుమ్మడిదల మండలంలో సాగు భూమితో పాటు అత్యధిక శాతం అటవీ ప్రాంతం అయినందున, జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డుతో పచ్చని పంట పొలాలతో పాటు అటవీ ప్రాంతం కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, రాజయ్య, అతిమెల మాణిక్, జి.సాయిలు, నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్, ప్రవీణ్ కుమార్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మళ్లీ గుప్పుమంటున్న గుడుంబా

- బీఆర్ఎస్ హయాంలో ఉక్కుపాదం..
- కాంగ్రెస్ పాలనలో ఏరులై పారుతున్న నాటుసారా
- కఠిన చర్యలు తీసుకోవడంలో ఎక్సైజ్ అధికారుల విఫలం


బైండోవర్ ఉల్లంఘనలో రూ. 50 వేల జరిమానా విధించిన పోలీసులు (ఫైల్)

అక్కన్నపేట, ఫిబ్రవరి 20: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో గుడుంబా దందా మళ్లీ మొదలైంది. ఇష్టారాజ్యంగా గుడుంబా తయారీ, రవాణా, అమ్మకాలు జరుగుతున్నాయి. పీడీ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. కానీ, తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటుండడంతో తయారీదారులు లెక్కచేయకుండా గుడుంబా దందా సాగిస్తున్నారు. మండలంలో సుమారు 100 వరకు గిరిజన తండాలు ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో గుడుంబాపై ఉక్కుపాదం మోపగా, కాంగ్రెస్ పాలనలో నాటుసారా ఏరులై పారుతున్నది. అక్కన్నపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో యథేచ్ఛగా గుడుంబా అమ్మకాలు జరుగుతుండడం గమనార్హం. గడిచిన రెండు నెలల్లో హుస్నాబాద్ ఎక్సైజ్ పోలీసులు జరిపిన దాడుల్లో సుమారు 80శాతం మేర అక్కన్నపేట మండలంలోనే కేసులు నమోదయ్యాయి. బీఆర్ఎస్ సర్కారు గుడుంబా తయారీపై ప్రత్యేక దృష్టిసారించి, పూర్తిగా అణిచివేసింది. గుడుంబాకు వాడే నల్ల బెల్లం విక్రయాలను నిషేధించింది. వ్యాపారులు ఇతరత్రా అవసరాల కోసం విక్రయించే తెల్ల బెల్లానికి కూడా నిబంధనలు పెట్టింది. గుడుంబా తయారీ దారులను గుర్తించి, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపింది. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చిన కొద్దిరోజుల్లోనే తండాల్లో తిరిగి గుడుంబా తయారీ జోరుగా కొనసాగుతోంది. ప్రధానంగా వ్యవసాయ బావుల వద్ద, తండాల్లోని ఇండ్ల సమీపంలో గుడుంబా బట్టీలను ఏర్పాటు చేసి సారా తయారు చేస్తున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనాలపై గుడుంబాను నంగునూర్, మద్దూరు, హుస్నాబాద్, కోహెడ, వేలేరు, అక్కన్నపేట, తరిగొప్పుల మండలాలతో పాటు వివిధ గ్రామాల్లోకి సరఫరా చేస్తున్నారు.

అధికారికంగా ఇన్ని కేసులు..

గడిచిన రెండు నెలల్లో హుస్నాబాద్ ఎక్సైజ్ పోలీసులు 24 నాటుసారా కేసులు నమోదు చేశారు. ఇందులో 20 మందిని అరెస్టు చేశారు. గుడుంబా తయారుచేస్తున్న 18 మందిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. 8 మంది బెల్లం వ్యాపారులను ముందస్తుగా బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘన కింద ఇద్దరిని జైలుకు పంపించగా, మరో ఇద్దరికి ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున రూ. లక్ష జరిమానా విధించారు. పోలీసుల దాడుల్లో 50లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోగా, 800 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అధికారికంగా ఇన్ని కేసులు నమోదు అయ్యాయంటే అనధికారికంగా గుడుంబా దందా ఏ స్థాయిలో నడుస్తుందోనని పలువురు పేర్కొంటున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- కొన్నేండ్లుగా ఫార్మా కంపెనీల్లో పల్లాడియం కార్బన్ చోరీ
- రూ. 4.50 కోట్ల విలువైన పల్లాడియం కార్బన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డిలో మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

కంది, ఫిబ్రవరి 20: కొన్నేండ్లుగా ఫార్మా కంపెనీల్లో పల్లాడియం కార్బన్ చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు, సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట, సీసీఎస్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ఆరుగురిని అరెస్టు చేసి సుమారు రూ.4.50కోట్ల విలువైన పల్లాడియం కార్బన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాకు ఎస్పీ చెన్నూరి రూపేశ్ వివరాలు వెల్లడించారు. ఈనెల 8న సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని యావాపూర్‌లో గల ఆరీన్ లైఫ్ సైన్సెస్ యూనిట్-3 కంపెనీలో జరిగిన పల్లాడియం కార్బన్ చోరీపై ఆ కంపెనీ సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ మజ్జి సూరప్ప నాయుడు ఫిర్యాదు మేరకు సదాశివపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసుపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నూతన సాంకేతికత, టెక్నికల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా ఈనెల 19న మద్దికుంట చౌరస్తాలో ఆరుగురు నేరస్తులను పట్టుకొని, వారి నుంచి 96 కిలోల పల్లాడియం కార్బన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులు అంతర్రాష్ట్ర ముఠాగా ఏర్పడి పలు ఫార్మా కంపెనీల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడు అల్లం సాంబశివుడు వివిధ ఫార్మా కంపెనీల్లో పనిచేయడంతో పల్లాడియం కార్బన్ అత్యంత విలువైందని తెలిసిందన్నారు.

ముఠాగా ఏర్పడి చోరీలు...

అల్లం సాంబశివుడు, ప్రసాద్ సాహెల్ షిటోల్, ఆదిత్య అంకుష్ మన్నె, తమ్మ ముక్కంటిరెడ్డి, మట్టా కుటుంబరావు, గుమ్మడి శ్రీనివాస్‌రావుతో పాటు పరారీలో ఉన్న మరి కొందరితో ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడ